# సాక్షి ప్రకాశం

బుధవారం। 23। ఏప్రిల్। 2025




### పరిహారం ప్రశ్నార్థకం

ఎన్‌హెచ్ 565 కనిగిరి బైపాస్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అయినా భూమి నష్టపోతున్న చిన్న, సన్నకారు రైతులకు నష్టపరిహారం అందించడం లేదు.

- 8లో..



### అడ్డగోలుగా నరికేద్దాం

పీసీపల్లి మండలం గుంటుపల్లి పరిధిలో అటవీ భూములు దాదాపు 70 ఎకరాల్లో ఉన్న జామాయిల్ కర్రలను టీడీపీ నేతలు కొట్టి అమ్ముకుంటున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

43 /24

### వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు డీఆర్‌సీ సమావేశం

**ఒంగోలు సబర్బన్:** జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్‌సీ) సమావేశం స్థానిక ప్రకాశం భవన్‌లోని మీ కోసం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ప్రజా ప్రతినిధులు, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొంటారని వివరించారు.

### చెన్నకేశవుని హుండీ ఆదాయం రూ.7.68 లక్షలు

**మార్కాపురం టౌన్:** పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఆలయ హుండీ లెక్కింపులో 25 రోజులకు గాను స్వామివారి ఆదాయం రూ.7,68,597 వచ్చిందని ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు. ఆలయ మధ్య రంగ మండపంలో ఫెస్టివల్ ఆఫీసర్ రమణమ్మ, శ్రీశైల దేవస్థానం డిప్యూటీ ఈఓ పర్యవేక్షణలో లెక్కింపు జరిగిందని తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### ఎస్సీ యాక్షన్ ప్లాన్ ద్వారా 1305 యూనిట్లు

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్

**పొదిలి రూరల్:** ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద జిల్లాకు 1305 యూనిట్లు మంజూరైనట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్ చెప్పారు. మంగళవారం పొదిలి మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకుల షెడ్యూల్ కులాల సేవా సహకార సంస్థ 2025–26కు సంబంధించి ఎస్సీ యాక్షన్ ప్లాన్ ద్వారా జిల్లాకు 1305 యూనిట్లు మంజూరు కాగా వాటి ఖరీదు రూ.54.66 కోట్లు ఉంటుందన్నారు. వాటిలో రూ.30.29 కోట్లు సబ్సిడీ పోగా, లబ్ధిదారుని వాటా రూ.2.73 కోట్లు చెల్లించాలని చెప్పారు. పొదిలి నగర పంచాయతీకి 21 యూనిట్లు, మండలానికి 22 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 21–50 వయస్సున్న లబ్ధిదారులు ఈ నెల 14 వ తేదీ నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ప్రారంభించారన్నారు. కారు కోసం నమోదు చేసుకొనే వారు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని చెప్పారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత వచ్చే నెల 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ యూనిట్లుకు మండల వారీగా కమిటీలు బ్యాంక్‌వారు కలిసి చర్చించుకుని ఎంపిక చేస్తారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శోభన్ బాబు పాల్గొన్నారు.

### సీహెచ్‌ఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**ఒంగోలు టౌన్:** వైద్య ఆరోగ్య శాఖలో సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఎన్జీఓ ప్రసిడెంట్ మంజీష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీష్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న వారు రెండేళ్లుగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని, ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు సంఘీభావం ప్రకటించిన డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు మాట్లాడుతూ సీహెచ్‌ఓల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, బదిలీలు, ఎక్స్‌గ్రేషియా, మెటర్నిటీ సెలవులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ మహిళా విభాగం ప్రసిడెంట్ కోటేశ్వరమ్మ, డీవైఎఫ్ఐ నాయకులు దానియేలు, సీహెచ్‌ఓ నాయకులు రాజేష్, వెల్లంపల్లి రాజేశ్వరి పాల్గొన్నారు.

# ఎవరి ఎజెండా వారిది!

నగరాభివృద్ధిలో కీలక భూమిక పోషించే నగరపాలక సంస్థ స్థాయీ సంఘం (స్టాండింగ్ కమిటీ) ఎన్నికలు అధికార కూటమిలో కాకరేపుతున్నాయి. ప్రస్తుతం కూటమి పార్టీలకు కౌన్సిల్‌లో పూర్తి మెజార్టీ ఉంది. స్థాయీ సంఘం కాలపరిమితి పూర్తయి ఏడాది కావొస్తున్నా కొత్త కమిటీ కొలువు దీరకపోవటానికి అధికార కూటమిలో లుకలుకలే కారణమని తెలుస్తోంది. ఇప్పటికే నగరంలో టీడీపీ వర్సెస్ జనసేన అన్నట్టుగా మారింది. జనసేన, బీజేపీలకు సైతం అవకాశం ఇవ్వాల్సి వస్తుందన్న కుట్రతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదన్న ప్రచారం కార్పొరేషన్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

- ఒంగోలు కార్పొరేషన్‌లో కూటమి పార్టీల మధ్య వర్గ పోరు
- స్టాండింగ్ కమిటీ కాల పరిమితి పూర్తయి ఏడాది
- ఇప్పటికీ వెలువడని నోటిఫికేషన్
- జనసేన సభ్యులు కూడా ఎక్కువగా ఉండటంతో ముందుకు రాని ఒంగోలు ఎమ్మెల్యే
- ప్రస్తుతం కౌన్సిల్లో టీడీపీ 25, జనసేన 21, వైసీపీకి 4 కార్పొరేటర్లు
- నగరంలో కుంటుపడుతున్న అభివృద్ధి




### జనసేన సభ్యులకు ఇవ్వటం ఇష్టం లేకనే...

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇస్తే కౌన్సిల్‌లో బలమున్న జనసేన సభ్యులకు ఇవ్వలేకనే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు మోకాలడ్డుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదుగురిలో కనీసం జనసేన సభ్యులకు ఇద్దరికైనా అవకాశం కల్పించాల్సి ఉంటుంది. అది ఇష్టంలేకనే ఎమ్మెల్యే ఎన్నికల నోటిఫికేషన్‌కు అడ్డుతగులుతున్నారని తెలుస్తోంది. ఎమ్మెల్యేని కాదని కమిషనర్ నోటిఫికేషన్ ఇచ్చే సాహసం చేయడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కూటమి సభ్యులు రెండు పార్టీలు కలుపుకుంటే మేయర్‌తో కలిపి 46 మంది అయ్యారు. వారిలో టీడీపీకి చెందిన వారు 25 మంది కాగా జనసేనకు చెందిన వారు 21 మంది ఉన్నారు. బాలినేని శ్రీనివాస రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడి జనసేనలోకి వెళ్లగానే 20 మంది కార్పొరేటర్లు ఆయన వెంటే జనసేనలోకి వెళ్లారు. ఎన్నికలు పెడితే ఐదుగురూ కూటమి సభ్యులే గెలుస్తారు.

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించిన టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్నే మరిచిపోయారు. నగరంలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే కార్పొరేషన్‌లో స్థాయీ సంఘానిదే కీలక భూమిక. నగరాభివృద్ధి కంటే రాజకీయాలే కూటమి నాయకులకు ముఖ్యమైనట్టున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి పార్టీలకు ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో పూర్తి స్థాయి మెజార్టీ ఉంది. అయితే స్థాయీ సంఘం ఎన్నికలంటే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వెనుకడుగు వేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ముందు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రస్తుతం కూటమి పార్టీల్లో భాగస్వాములుగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం బాలినేని శ్రీనివాస రెడ్డి జనసేన తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. వీరి ఇద్దరి మధ్య ఇప్పటికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. స్థాయీ సంఘం వేస్తే 21 సభ్యులున్న జనసేనకు స్థానం కల్పించాల్సి వస్తుంది. అందుకే ఈ కమిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు ఇష్టపడడంలేదని తెలుస్తోంది. నగరపాలక సంస్థలోని కార్పొరేటర్లలో ఐదుగుర్ని స్టాండింగ్ కమిటీగా ఎన్నుకుంటారు. ఇందుకు సంబంధించి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి ఆ ప్రక్రియను పూర్తి చేయాలి. ఇంత వరకూ అలాంటిదేమి జరగలేదు.

**ఇప్పటి వరకు మూడు కమిటీలు:**

ఒంగోలు నగర పాలక సంస్థ ఏర్పడిన నాటి నుంచి మూడు స్టాండింగ్ కమిటీలు పనిచేశాయి. అవి కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పనిచేశాయి. ఒక్కో స్టాండింగ్ కమిటీ ఏడాది పాటు ఉంటుంది. నగర పాలక సంస్థలో 50 మంది కార్పొరేటర్లు ఉన్నారు. 10 మందికి ఒకరు చొప్పున స్టాండింగ్ కమిటీ సభ్యుడ్ని ఎన్నుకుంటారు. అంటే ఐదుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికవుతారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 50 మంది కార్పొరేటర్లలో 43 మంది వైఎస్సార్‌సీపీ వాళ్లే. మిగతా సభ్యుల్లో ఆరుగురు టీడీపీకి చెందిన వారు, ఒక్కరు జనసేనకు పక్షాన ఉన్నారు. ప్రభుత్వం మారగానే పరిస్థితి మారిపోయింది.

**ఇక స్టాండింగ్ కమిటీ లేనట్లే....**

నగర పాలక సంస్థకు ఇక స్టాండింగ్ కమిటీలు లేనట్టేనని తెలుస్తోంది. ఎందుకంటే 2026 మార్చి 18వ తేదీతో పాలక మండలి కాల పరిమితి ముగుస్తుంది. స్టాండింగ్ కమిటీ 2024 జూన్ మాసంతో కాల పరిమితి పూర్తయింది. స్టాండింగ్ కమిటీ కాల పరిమితి ఏడాది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థాయీ సంఘాలను ఏర్పాటు చేస్తే ఆగస్టు నాటికి కాలపరిమితి పూర్తయ్యేది. తరువాత రెండో కమిటీకి అవకాశం ఉండేది. అలాంటిది ఆగర్భ శత్రువు బాలినేని శ్రీనివాస రెడ్డితో పొసగలేక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్టాండింగ్ కమిటీ వేయటానికి సుముఖత చూపటం లేదు. బాలినేని జనసేన పార్టీలో చేరినా ఇప్పటి వరకు వీళ్లిద్దరూ ఒకే వేదికను పంచుకున్నది కూడా లేదు. కూటమి పార్టీల్లో విభేదాలు నగరాభివృద్ధికి అవరోధంగా మారాయనడంలో సందేహం లేదు.

### నగరాభివృద్ధిలో కీలకపాత్ర

నగరాభివృద్ధిలో స్థాయీ సంఘం పాత్ర కీలకం. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నెలలో 4 సార్లు కమిటీ సమావేశం కావచ్చు. మేయర్, కమిషనర్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్టాంగింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనాలి. నగరం అభివృద్ధికి సంబంధించి ఆ సమావేశాల్లో చర్చ జరుగుతుంది. రూ.40 లక్షల వరకు ఈ కమిటీ ఆమోద ముద్ర వేయవచ్చు. రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు స్టాండింగ్ కమిటీకి పవర్ ఉంది. రూ.10 లక్షల లోపు అయితే కమిషనర్ అనుమతి సరిపోతుంది. కౌన్సిల్ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి జరుగుతుంది. స్టాండింగ్ కమిటీకి అలాంటి నిబంధనలు ఏమీ లేవు. స్టాండింగ్ కమిటీ లేకపోవటంతో మేయర్ ద్వారా ముందస్తు అనుమతులు తీసుకుని అభివృద్ధి పనులను చేపట్టి తరువాత వాటిని కౌన్సిల్ ఆమోదింప చేసుకుంటున్నారు. దాంతో వర్కుల్లో వచ్చే పర్సెంటేజీలు పాలక మండలి ప్రధాన నేతతో పాటు అధికారులకు పంట పండుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతా ఎక్సెస్‌లే కాబట్టి నియోజకవర్గ ముఖ్య నేతను ప్రసన్నం చేసుకుని జేబులు నింపుకుంటున్నారు.

# 3 నిమిషాల్లో హతమార్చేశారు!

- పక్కా ప్రణాళికతోనే దారుణ హత్య
- మొదట గొంతుపై పొడిచి ఆ తరువాత 25 పోట్లు పొడిచి హత్య చేసినట్లు సమాచారం
- సుపారీ హత్యగా ప్రచారం
- హత్యతో ఉలిక్కిపడిన ఒంగోలు నగరం
- 12 బృందాలతో ప్రత్యేక గాలింపు
- పోలీసు అదుపులో ముగ్గురు?
- ప్రత్యేకంగా పర్యవేక్షించిన ఎస్పీ దామోదర్
- మేనల్లుడి హత్యతో మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబుకు గుండెపోటు



ఒంగోలు జీజీహెచ్ దగ్గర గుమిగూడిన వీరయ్య చౌదరి బంధుమిత్రులు



ఘటనా స్థలం వద్ద ఎస్పీ ఏఆర్ దామోదర్



డాగ్ స్క్వాడ్ పరిశీలన



వీరయ్య చౌదరి మృతదేహం



వీరయ్య చౌదరి (ఫైల్)

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** అధికార పార్టీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి (49) దారుణ హత్య ఒంగోలు నగరంలో సంచలనాన్ని రేకెత్తించింది. నగర ప్రజలు కలవరపాటుకు గురయ్యారు. పక్కా ప్రణాళికతో బైకులపై వచ్చిన నలుగురు యువకులు కేవలం మూడు నిమిషాల్లోనే హత్య చేసి పరారయ్యారు. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో జరగడంతో పోలీసులు సైతం ఉలిక్కిపడ్డారు. దశాబ్దకాలంగా ప్రశాంతంగా ఉన్న నగరంలో టీడీపీ నాయకుడి దారుణ హత్య సంచలనం సృష్టిస్తోంది. ఎస్పీ దామోదర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 12 బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

**పక్కా ప్రణాళికతో..**

పక్కా ప్రణాళికతో నలుగురు యువకులు రాత్రి 7.33 నిమిషాలకు వీరయ్య చౌదరి కార్యాలయంలోకి ప్రవేశించి కేవలం మూడు నిమిషాల్లో 25 చోట్ల కొడవళ్లతో దాడి చేసి వెళ్లిపోయినట్టు తెలిసింది. వ్యక్తిగత పనుల మీద హైదరాబాద్ వెళ్లిన ఆయన మంగళవారం ఉదయమే తిరిగి వచ్చినట్లు తెలిసింది. మధ్యాహ్నం వరకు వీరయ్య చాలా బిజీగా గడిపారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇంటికి వెళ్లి కలిసి మాట్లాడినట్లు సమాచారం. ఆ తరువాత అక్కడ నుంచి నేరుగా వెళ్లి బైపాస్ మీద బండికి పెట్రోలు కొట్టించుకొని ఆఫీసుకు వెళ్లినట్లు తెలిసింది. సాయంత్రం 6.30 తరువాత ఆయన మంగమూరు రోడ్డులోని కార్యాలయానికి వెళ్లారు. అప్పటికే హంతకులు అక్కడకు చేరుకున్నట్లు సమాచారం. వీరయ్య చౌదరి కార్యాలయంలోకి వెళ్లిన కాసేపటి తరువాత సరిగ్గా గం.7.33 కు హంతకులు లోపలకు వెళ్లారు. లోపల ఉన్న ముగ్గురు కార్యాలయ సిబ్బందిని కత్తులు చూపి బెదిరించి పక్కనే ఉన్న గదిలోకి నెట్టివేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తలుపులు తీయడానికి ప్రయత్నిస్తే చంపేస్తామని వారిని బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ లోపు కార్యాలయంలో ఏదో గొడవ జరుగుతున్నట్లు భావించిన వీరయ్య బయటకు రాగానే హంతకులు వేటకొడవళ్లతో దాడి చేసినట్లు సమాచారం. మొదట గొంతు మీద పొడిచినట్లు చెబుతున్నారు. గొంతు నుంచి గుండెల వరకు 15 పోట్లు పొడిచారని, తరువాత పొత్తి కడుపులోకి మరో 10 పోట్లు పొడిచిన తర్వాత వీరయ్య చనిపోయాడని నిర్ధారించుకున్నాకే హంతకులు అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. చేయి తిరిగిన హంతకులే ఈ హత్య చేసినట్లు స్పష్టంగా తెలుస్తోందని పోలీసులు అంచనా వేస్తున్నారు. హంతకులు 25 సంవత్సరాల వయసు లోపు వారేనని, వచ్చిన వారు స్పష్టంగా తెలుగులోనే మాట్లాడారని విశ్వసనీయ సమాచారం. మధ్యాహ్నం ఒకసారి హంతకులు ఆఫీసుకు వచ్చి రెక్కీ నిర్వహించినట్టు ప్రచారం జరుగుతోంది.

**హత్యకు కారణమేమిటి...?**

వీరయ్య చౌదరి హత్యకు కారణమేమిటన్న చర్చ జోరుగా సాగుతోంది. ఆయనకు ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటుగా పల్నాడు జిల్లాలో మద్యం వ్యాపారాలు ఉన్నాయని తెలుస్తోంది. సిండికేట్లతో కలిసి మద్యం వ్యాపారం చేస్తున్నారని, కొన్ని రోజులుగా విభేదాలు నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అలాగే ఆయనకు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఇటీవల బెంగళూరులో కొన్న ఒక భూమి వివాదం కొనసాగుతోందని, ఈ నేపథ్యంలో హత్య జరిగిందని ప్రచారం ఉంది. అలాగే రామాయపట్నం పోర్టుకు సమీపంలో వివాదాస్పద భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, అది కూడా కారణం కావచ్చన్న ప్రచారం సాగుతోంది. అలాగే తెలుగుదేశం పార్టీలో కొంతమందితో ఈయనకు వివాదాలు ఉన్నట్టు తెలిసింది. మొత్తం వీరయ్య చౌదరి హత్యకు కారణాలు స్పష్టంగా తెలియడం లేదు.

**12 బృందాలతో ముమ్మర గాలింపు...**

వీరయ్య చౌదరి హత్యకు సంబంధించి సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సాయంత్రం గం.7.33 సమయంలో బైకుల మీద వచ్చిన నలుగురు యువకులు లోపలకు వెళ్లి వీరయ్య చౌదరిని హత్య చేసి గం.7.36 కల్లా బైకుల మీద పరారయ్యారని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు 40 మందితో 12 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ను రంగంలోకి దించినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అన్నీ కోణాల్లో సమగ్ర విచారణ జరుపుతామని చెప్పారు. ఎప్పటికప్పుడు దర్యాప్తు ప్రగతిపై సమీక్షిస్తామని, వీలైనంత త్వరగా కేసునే ఛేదించడానికి కృషి చేస్తామని తెలిపారు.

**ఉలిక్కిపడిన ఒంగోలు...**

దశాబ్దాల కాలంలో ఇలాంటి హత్య జరగడం ఇదే తొలిసారి కావడంతో ఒంగోలు ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పైగా ఒక అధికార పార్టీ నాయకుడు హత్యకు గురి కావడం, ఎస్పీ ఆఫీసుకు కూత వేటు దూరంలో హత్య జరగడం చర్చనీయాంశమైంది. నలుగురు హంతకులు నగరంలోకి ప్రవేశించి పక్కా ప్రణాళిక ప్రకారం హత్య చేయడంపై భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. వీరయ్య చౌదరి హత్య వార్త తెలిసిన వెంటనే పార్టీ అభిమానులు, ఆయన అనుచరులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు జీజీహెచ్ వద్దకు చేరుకున్నారు. దాంతో స్పెషల్ పార్టీ పోలీసులను రంగంలోకి దించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని విచారణ చేస్తున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. ఈ హత్య నేపథ్యంలో నేడు హోం మంత్రి అనిత జిల్లాకు వస్తున్నట్లు సమాచారం.

**ఈదర హరిబాబుకు గుండెపోటు...**

హత్యకు గురైన వీరయ్య చౌదరి మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబుకు మేనల్లుడు. ఆయన హత్య వార్త తెలిసిన వెంటనే హరిబాబు జీజీహెచ్ వద్దకు వచ్చారు. కాసేపటికే ఆయనకు గుండెపోటు వచ్చింది. దాంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వైద్యులు ఆయనను వెంటిలేటర్‌పై చికిత్స చేస్తున్నట్లు సమాచారం.

**పంచాయతీ వార్డు సభ్యునిగా..**

**నాగులుప్పలపాడు:** ఒంగోలులో దారుణ హత్యకు గురైన ముప్పవరపు వీరయ్య చౌదరి ఒంగోలు మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబుకు స్వయానా మేనల్లుడు కావడంతో తొలుత అమ్మనబ్రోలు గ్రామంలో నాయకుడిగా ఎదగగలిగారు. ఈ క్రమంలో 2013–18 కాలంలో అమ్మనబ్రోలు గ్రామ పంచాయతీలో వార్డు సభ్యునిగా గెలిచి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం 2014 లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో చవటపాలెం గ్రామ ఎంపీటీసీగా గెలిచి నాగులుప్పలపాడు మండల పరిషత్ అధ్యక్షుడిగా పూర్తి కాలం పనిచేశారు. ఈ క్రమంలో టీడీపీలో ఉన్న పరిచయాలతో ప్రస్తుతం బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య ముప్పవరపు సుచరిత, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం వీరయ్య చౌదరి భార్య సుచరిత కూడా చవటపాలెం ఎంపీటీసీగా పనిచేస్తుండగా, కుమారుడు ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు.

# పొగాకు రైతులకు న్యాయం చేయాలి

- వెల్లంపల్లి పొగాకు బోర్డు వద్ద బైఠాయించిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున
- పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ నిరసన



వెల్లంపల్లి పొగాకు బోర్డు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మేరుగు నాగార్జున, పార్టీ నాయకులు, రైతులు

**మద్దిపాడు:** పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. మద్దిపాడు మండలం వెల్లంపల్లి పొగాకు బోర్డులో జరుగుతున్న వేలంపాటను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏ పంట వేసిన రైతు కూడా కూటమి ప్రభుత్వంలో సంతోషంగా లేరని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు మద్దతు ధర కల్పించకుండా రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నాయని విమర్శించారు. రైతులు తమ పంటలకు మద్దతు ధరలు లేక దళారులపాలై విలవిల్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వరి పంట వేసిన రైతులు పంటను అమ్ముకోలేక కష్టాలు పడుతున్నారని, అదేవిధంగా గత ఏడాది మంచి ధర పలికిన మిర్చికి ఈ సంవత్సరం ధరలు లేక రైతులు విలవిల్లాడిపోతున్నారని అన్నారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకొచ్చి మిర్చి రైతులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబును ప్రశ్నిస్తే ఆయన కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి మిర్చి క్వింటాకు రూ.11 వేల మద్దతు ధరను ఇస్తామని చెప్పి ఆ విషయాన్ని గాలికి వదిలేశారన్నారు. ఈ ప్రాంతంలో పండే శనగ, మొక్కజొన్న పంటలకు కూడా సరైన మద్దతు ధర లేక దళారులు అతి తక్కువ ధరకు అడుగుతున్న క్రమంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో పొగాకు వ్యాపారులు సిండికేట్ అయి అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న క్రమంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పొగాకు రైతుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసి, మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల పొగాకును చివరి కేజీ వరకు కొనుగోలు చేయించారని గుర్తు చేశారు. ఆ తరువాత వరుసగా మూడేళ్ల పాటు రైతులు సరైన గిట్టుబాటు ధర పొందారన్నారు. గతంలో క్వింటా ధర రూ.36 వేల వరకు కొనుగోలు చేసిన పొగాకు కంపెనీలు ఇప్పుడు రూ.23 వేలకే కొనుగోలు చేయడానికి తటపటాయిస్తున్నాయని అన్నారు. వేలం కేంద్రానికి తీసుకొచ్చిన పొగాకు బేళ్లు సగానికి పైగా నోబిడ్ అవ్వడం అత్యంత దారుణం అని, పొగాకు పంట వేసిన కౌలు రైతులు కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసి, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే అవసరమైతే ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో ఆయన రైతులకు మద్దతు ధర కల్పించలేని కూటమి ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తూ వేలం కేంద్రం ఫ్లోర్లో బైఠాయించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పోలవరపు శ్రీమన్నారాయణ, దుంప చెంచిరెడ్డి, సీనియర్ నాయకులు గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి, నల్లమలుపు కృష్ణారెడ్డి, వాకా కోటిరెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి గుంతోటి రవి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బి.శ్రీరామ్ మూర్తి, గుడ్డపాతల రవి, మద్దా లక్ష్మీనారాయణ ఉన్నారు.

# ఐపీఎస్ కల నెరవేరిన వేళ..



ఉదయ్ కృష్ణారెడ్డి

**సింగరాయకొండ:** గ్రూప్–1 పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఏఎస్, ఐపీఎస్ కావాలన్న దృఢ సంకల్పంతో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి చివరి ప్రయత్నంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలో 350 ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నాడు సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామానికి చెందిన మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డి. చిన్నప్పుడే తండ్రి శ్రీనివాసులరెడ్డి, తల్లి జయమ్మలను పోగొట్టుకున్న ఉదయ్ కృష్ణారెడ్డి, తమ్ముడు ప్రణయ్ రెడ్డి తో కలిసి నాయనమ్మ రమణమ్మ సంరక్షణలో ఉన్నాడు. రమణమ్మ కూరగాయల వ్యాపారం చేసుకుంటూ తన ఇద్దరు మనవళ్లను చదివించింది. చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదివిన ఉదయ్ కృష్ణారెడ్డి 2012వ సంవత్సరంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి నెల్లూరు జిల్లా గుడ్లూరు మండల పోలీస్‌స్టేషన్ లో ఉద్యోగంలో చేరాడు. తరువాత రామాయపట్నం మెరైన్ కానిస్టేబుల్‌గా బదిలీ అయ్యాడు. ఆ సమయంలో మెరైన్ సీఐ దురుసు ప్రవర్తనతో ఆవేదన చెంది ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ పరీక్ష రాసి ఐఏఎస్ లేదా ఐపీఎస్ కావాలని నిశ్చయించుకుని కఠోర కృషి చేశాడు. గత సంవత్సరం సివిల్స్‌లో 780 మార్కులు సాధించి ఐఆర్‌ఎంఎస్‌కు ఎంపికయ్యాడు. కానీ చిన్నప్పటి నుంచి సివిల్స్ లో ర్యాంకు సాధించి కలెక్టర్ లేదా ఎస్పీ కావాలన్న కోరికతో ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డి 2019వ సంవత్సరంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్ వెళ్లి సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. ఇప్పటికి నాలుగు సార్లు పరీక్షలు రాయగా మొదటిసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లినప్పటికీ 9 మార్కులు తగ్గాయి. రెండో సారి, మూడో సారి పరీక్షలకు ప్రిపేర్ అయినప్పటికీ ప్రిలిమ్స్ దశలోనే వెనుదిరిగాడు. నాలుగో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 780 వ ర్యాంకు, 5వ సారి చివరి ప్రయత్నంలో 350 మార్కులు సాధించి ఐపీఎస్ కావాలన్న తన కోరిక తీర్చుకున్నాడు. దీనిపై ఉదయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐఏఎస్‌కానీ, ఐపీఎస్ కానీ కావాలన్నది తన కోరికని ఈ ర్యాంకు ప్రకారం ఐపీఎస్‌కు ఎంపికవుతానని, ఐఏఎస్‌కు ఎంపిక కావటానికి 10 శాతం అవకాశాలున్నాయని వివరించాడు. ఈ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్, గ్రామస్తులు అభినందించారు.

## క్లుప్తంగా

### డెయిరీ భూములను పరిశీలించిన జేసీ


డెయిరీ భూములను పరిశీలిస్తున్న జేసీ, ఇతర అధికారులు

**ఒంగోలు సబర్బన్:** ఒంగోలు డెయిరీ భూములను జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భూములను అత్యవసరంగా సర్వే చేసి వాటి హద్దులను, హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని రెవిన్యూ, సర్వే అధికారులను ఆదేశించామన్నారు. ఈ సందర్భంగా కొంతమంది తమకు పేర్నమిట్ట సర్వే నెంబర్ 140లో ఇంటి నివేశన స్థలాలను రిజిస్టర్ డాక్యుమెంట్లు ద్వారా కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్‌కు దృష్టికి తీసుకొచ్చారు. డాక్యుమెంట్లను తీసుకొని పరిశీలించి తగు చర్యలను తీసుకోవాల్సిందిగా ఒంగోలు ఆర్డీఓను, సంతనూతలపాడు తహశీల్దార్‌ను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, సంతనూతలపాడు తహసీల్దార్, సర్వే, భూ రికార్డుల అధికారులు ఉన్నారు.

### బస్టాండ్‌లో గడువు తీరిన కూల్‌డ్రింక్స్ విక్రయం



**ఒంగోలు టౌన్:** జిల్లా కేంద్రం ఒంగోలు ఆర్టీసీ డిపోలో గడువు తీరిన కూల్ డ్రింక్స్ విక్రయించడం మంగళవారం కలకలం సృష్టించింది. ఉప్పుగుండూరుకు చెందిన మహిళ రెండు రోజుల క్రితం శ్రీశైలం వెళ్లేందుకు ఒంగోలు ఆర్టీసీ డిపోకు వచ్చింది. బస్సు వచ్చిన హడావుడిలో డిపోలోని ఒక షాపులో కూల్ డ్రింక్ కొనుక్కొని వెళ్లి బస్సెక్కింది. బస్సులో డ్రింక్ తాగిన కొద్దిసేపటికి ఆమెకు కడుపులో తిప్పడం మొదలైంది. అనుమానం వచ్చి కూల్ డ్రింక్ బాటిల్ తీసి చూడగా దానిపై తేదీ మించి మూడు నెలల కావస్తోంది. ఇది గమనించిన ఆమె ఆందోళనకు గురైంది. తిరుగు ప్రయాణంలో ఆదివారం ఒంగోలులో బస్సు దిగింది. కూల్ డ్రింక్ షాపు యజమాని వద్దకు వెళ్లి అడిగితే నీకు దిక్కున్న చోట చెప్పుకో..అంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు. డిపో అధికారులకు ఫోన్లు చేసినా స్పందన లేకపోవడంతో చేసేదేమి లేక వెళ్లిపోయారు. ప్రతి బాటిల్‌పై 10 రుపాయలు అదనంగా తీసుకుంటూ కూడా ఇలా గడువుతీరిన కూల్ డ్రింకులను విక్రయించడం దుర్మార్గమని బాధిత మహిళ వాపోయారు. ఈ విషయం గురించి డిపో మేనేజర్ డి.శ్రీనివాసులును వివరణ అడిగితే షాపును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ప్రభాకర్ రావు దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతానికి తాను చీరాలలో ఉన్నానని, ఒంగోలు వచ్చిన తర్వాత తనిఖీ చేసి చర్యలు తీసుకుంటానని తెలిపారు. గడువు తీరిన వస్తువులను విక్రయించిన దుకాణాదారుడిని కఠినంగా శిక్షించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### శిక్షణ హాజరు 75 శాతం ఉంటేనే కుట్టు మిషన్లు

**ఒంగోలు వన్‌టౌన్:** కుట్టు శిక్షణకు హాజరు 75 శాతం ఉంటేనే ఉచితంగా కుట్టు మిషన్లు మంజూరు చేస్తామని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5363 మందికి కుట్టుపై శిక్షణ ఇస్తామన్నారు. దీనిలో భాగంగా దర్శి మండలంలో రెండు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి 288 మందికి కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దర్శి సచివాలయం 5 పరిధిలోని శివాజీనగర్‌లో, దర్శి సచివాలయం 2 పరిధిలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలకు కుట్టు మిషన్‌లను ఉచితంగా అందించడమే కాకుండా భవిష్యత్తులో స్వయం శక్తితో ఎదిగేందుకు వీలుగా సబ్సిడీ రుణాలు కుడా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# పరిహారం..ప్రశ్నార్థకం..!

- ఎన్‌హెచ్ 565 భూ బాధితుల్లో హై టెన్షన్
- పూర్తి కావస్తున్న రోడ్డు నిర్మాణం.. దక్కని పరిహారం
- ఫైనాన్షియల్ ఇన్ వాలిడ్ సాకుతో 48 మందికి మొండిచెయ్యి


కనిగిరి ఎన్‌హెచ్ 565హైవే రోడ్డు

**కనిగిరిరూరల్:** ఎన్‌హెచ్ 565 బైపాస్ పనులు శరవేగంగా సాగుతున్నాయి.. రోడ్డు పనులు కూడా చివరి దశకు చేరాయి.. భూమి నష్టపోతున్న బాధితులకు నష్టపరిహారం మాత్రం అందలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నష్టపరిహారం అందలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కనిగిరి బైపాస్ భూ బాధితుల నష్టపరిహారం ప్రశ్నార్థకంగా మారింది. తొలి విడతలో బడా రైతులకు భూ పరిహారం అందించిన అధికారులు.. చిన్న, సన్నకారు రైతులకు భూ నష్టపరిహారం అందించే విషయంలో పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సెంటు నుంచి 5 సెంట్ల వరకు భూములు, ప్లాట్లు కోల్పోయిన బాధితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

**48 మంది సన్నకారు రైతుల పరిహార జాబితా వెనక్కి..?**

ఏ శాఖ అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ 48 మంది చిన్న భూ బాధిత రైతుల పరిహార జాబితా వెనక్కి వచ్చినట్లు తెలిసింది. భూసేకరణ సెక్షన్ అధికారులు అలసత్వంతో గత నెలలో ఫైల్ పంపించడం వల్లే వెనక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఇన్ వాలిడ్ ఫైనాన్షియల్ ఇయర్ అనే కారణం చూపుతూ జాతీయ రహదారుల అథారిటీ పరిహారం జాబితాకు తిప్పి పంపింది. అయితే మార్చి లోనే తాము ఫైల్ పెట్టామని, పరిహార జాబితా శాంక్షన్ కాకుండా ఎందుకు వెనక్కి పంపారో తెలియదని కలెక్టరేట్ లోని ల్యాండ్స్ సెక్షన్ అధికారులు బుకాయిస్తున్నారు. రెండు శాఖల మధ్య పొంతన లేని సమాధానాలు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ..**

కనిగిరిలో ఎన్‌హెచ్ 656 రోడ్డు నిర్మాణ సమయంలో భూ బాధితులందరికీ న్యాయం చేస్తామని, అభివృద్ధిని ఎవరూ అడ్డు కోవద్దని, ప్రతి ఒక్కరికీ పరిహారం ఇప్పిస్తామని డివిజన్, జిల్లా స్థాయి అధికారులు సమావేశాలు నిర్వహించి రోడ్డు పనులు సాఫీగా జరిగేలా చూశారు. కానీ చిన్న చితకా రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో మాత్రం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శించారు. ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షణ చేయకపోవడంతో 48 మంది సంబంధించిన పరిహార జాబితా వెనక్కి వచ్చినట్లు తెలిసింది. జాతీయ రహదారుల సంస్థ( నేషనల్ హైవే అథారిటీ) పరిహారం కోసం బాధితులు రెవెన్యూ, కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎన్‌హెచ్ అధికారులు తిప్పి పంపిన ఫైల్‌తో పాటు ఇంకా క్లెయిమ్స్ పెట్టని భూ బాధితులు మరి కొందరున్నారు. బైపాస్ రోడ్డు బాధితులకు సంబంధించి సుమారు రూ .13 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉండగా 60 శాతం కూడా పరిహారం చెల్లింపులు పూర్తి కాలేదని సమాచారం. తమకు రావాల్సిన పరిహారంపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు దృష్టి సారించి న్యాయం చేయాలని సన్న, చిన్న కారు భూ బాధితులు కోరుతున్నారు.

**తహసీల్దార్ ఏమంటున్నారంటే..**

దీనిపై స్థానిక తహసీల్దార్ రవి శంకర్‌ను సాక్షి వివరణ కోరగా ఇన్‌వాలిడ్ ఫైనాన్షియల్ ఇయర్ కారణంతో ఫైల్ వెనక్కి వచ్చినా... మళ్లీ ఫైల్‌ను రీ శాంక్షన్‌కు పంపిస్తామన్నారు. దీని వల్ల బాధితులకు ఎటువంటి నష్టం జరగదన్నారు. త్వరలోనే హైవే రోడ్డు బాధితులందరికీ పరిహారం నిధులు పడుతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.


తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

# తప్పుడు కేసులు బనాయిస్తే ఊరుకోం

- అంతకు రెండింతలు అనుభవిస్తారు
- టీడీపీ జీతాలు ఇవ్వడం లేదన్న సంగతి పోలీసులు గ్రహించాలి
- బాధితులకు ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు హెచ్చరిక

**ఒంగోలు టౌన్:** గుండాయపాలెం ఎంపీటీసీ ఐలా వాణి భర్త ఏడుకొండలపై తప్పుడు ఫిర్యాదులు చేసిన వారు అంతకు రెండింతలు అనుభవిస్తారని, తప్పుడు కేసుల్లో ఇరికించాలని చూస్తే ఊరుకోమని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవిబాబు హెచ్చరించారు. గుండాయపాలెం ఎంపీటీసీ ఐలా వాణి భర్త ఏడుకొండలు అక్రమ అరెస్టు, నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ నాయకులు, లీగల్ సెల్ న్యాయవాదులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం తాలుకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దాడి చేసిన వారిని వదిలి పెట్టి గాయపడిన వారిని అరెస్టు చేయడమేంటని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు తెలుగుదేశం పార్టీ జీతాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వంలోని ముఖ్యమైన విభాగంలో తాము పని చేస్తున్నామని సంగతిని పోలీసులు గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. అర్ధరాత్రి అరెస్టు చేసి అక్రమంగా నిర్బంధించడమేంటని మండిపడ్డారు. అరెస్టు చేసిన వారిని ఎక్కడ ఉంచారో చెప్పాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బాధిత కుటుంబం, న్యాయవాదులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని, పోలీసుల కస్టడీలో ఉన్న వారితో కలిసి మాట్లాడాల్సి ఉందని చెప్పారు. అసలు ఏడుకొండలపై ఏ కేసు పెట్టారో, ఎందుకు నిర్బంధించారో, ఎక్కడున్నారో అడుగుతుంటే సమాధానం చెప్పకపోతే ఎలా అని నిలదీశారు. సాయంత్రం లోగా పోలీసులను కోర్టులో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. బాధితులపై పెట్టిన కేసుల వివరాలను వెల్లడించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

వారిపై ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత అని స్పష్టం చేశారు. ఏడుకొండలు కుటుంబం గొడవలకు దూరంగా ఉంటారని, వివాదాలంటే అమడ దూరం పారిపోయే అమాయకులపై కూటమి నాయకులు దాడి చేయడం దారుణమన్నారు. ఈ విషయం గురించి గుండాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొందరినీ అడిగితే మాకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారని, ఇదంతా ఒంగోలు రాజకీయమని చెబుతున్నారని తెలిపారు. ఈ కేసుల వెనుక ఉన్న ఒంగోలు వ్యక్తులు ఎవరో చెప్పాలన్నారు. ఎంపీటీసీ ఐలా వాణి మాట్లాడుతూ గ్రామంలోని రామాలయం సెంటర్లో షాపులో ఉన్న మాపై పెదసింగి వెంకటేశ్వర్లు అనే టీడీపీ నాయకుడు వచ్చి దాడి చేసి కొట్టారని చెప్పారు. దాడిలో గాయాలయ్యాయని సీఐకి చెప్పినా పట్టించుకోకపోగా, బాగానే ఉందిగా అన్నాడని తెలిపారు. తన భర్తకు షుగర్ వుందని, నిన్నటి నుంచి మందులు కానీ, ఆహారం ఇవ్వలేదని, ఏమైనా అవుతుందేమోనని భయంగా ఉందని కన్నీరు పెట్టుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నగర కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి రమణమ్మ, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, తాతా నరసింహారావు, మలిశెట్టి దేవ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతానికి ఇద్దరు దుర్మరణం

**పెద్దదోర్నాల:**

వేర్వేరు ప్రమాదాల్లో విద్యుదాఘాతానికి ఇద్దరు మృతి చెందారు. నివాసగృహంలో ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా చేతికి వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై యువకుడు దుర్మరణం మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గంటవానిపల్లెలో సోమవారం జరిగింది. ఘటనలో యలకపాటి ఏసుదానం (40) మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు .. యలకపాటి ఏసుదానం తన ఇంట్లోని టేబుల్ ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా హై ఓల్టేజీ వచ్చింది. ఈ క్రమంలో ఫ్యాన్ వైర్ చేతికి తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకుతరలించారు. మృతునికి భార్య, కుమారులు, కుమార్తె ఉన్నారు. ఏసుదానం మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.


ఏసుదానం మృతదేహం

**మార్కాపురం:** విద్యుదాఘాతానికి వెస్ట్ బెంగాల్ కార్మికుడు మృతి చెందాడు. రూరల్ ఏఎస్సై శ్రీనివాసరావు వివరాల మేరకు..వెస్ట్‌బెంగాల్‌రాష్ట్రంలోని మాల్దా జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన షేక్ రబూల్ (24) విద్యుత్ కార్మికునిగా పనిచేస్తూ ఇటీవల మార్కాపురం మండలం తిప్పాయిపాలెం గ్రామం వద్ద జరుగుతున్న 11 కేవీ విద్యుత్‌లైను పనులకు వచ్చాడు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం పనిచేస్తుండగా తీగలకు విద్యుత్‌సరఫరా వచ్చి షాక్‌కు గురయ్యాడు. వెంటనే జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

### గంజాయి విక్రేతలపై పీడీ యాక్ట్

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ


సమీక్షలో మాట్లాడుతున్న రాహుల్‌దేవ్ శర్మ

**మార్కాపురం:** గంజాయి విక్రయించే వారిపై, పదే పదే గంజాయి కేసులో అరెస్టు అయిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అధికారులను ఆదేశించారు. ఏఈఎస్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. మార్కాపురం, కంభం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి ఎక్సైజ్ స్టేషన్ల సీఐలతో నాటుసారా, గంజాయి, నాన్ డ్యూటీపెయిడ్ మద్యంపై సమీక్ష నిర్వహించారు. నాటుసారా తయారుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదే పదే ఈ కేసుల్లో అరెస్టు అయ్యేవారిపై పీడీ యాక్టు పెట్టాలన్నారు. డిప్యూటీ కమిషనర్ హేమంత నాగరాజు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఎస్టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్, మార్కాపురం ఏఈఎస్ బాలయ్య, సీఐ వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుడు ఆత్మహత్య

**గిద్దలూరు రూరల్:** పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల భవనం పై నుంచి దూకి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సాయికుమార్(63) భిక్షాటన చేసుకుని జీవనం కొనసాగించే వృద్ధుడు రెండు రోజుల క్రితం ఆటో తగిలిందని వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు. చికిత్స పొందుతున్న సాయికుమార్ తెల్లవారుజామున నెమ్మదిగా వైద్యశాల భవనం పైకి ఎక్కి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనను దేవుడు పిలుస్తున్నాడని, నేను వచ్చిన సమయం పూర్తయిందని తోటి రోగులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### మిద్దెపై నుంచి పడి మహిళ మృతి

**మార్కాపురం టౌన్:** దుస్తులు ఆరేస్తూ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోలభీమునిపాడు గ్రామానికి చెందిన బైరెడ్డి వెంకటరెడ్డి భార్య రమణమ్మ (38) మంగళవారం దుస్తులు ఉతికి మిద్దెపై ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో బలమైన గాయాలై మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రంగయ్య తెలిపారు.

# జూనియర్ సివిల్ జడ్జిలకు స్థాన చలనం

**ఒంగోలు:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానాల్లో ఇతర ప్రాంతాలకు సంబంధించిన జూనియర్ సివిల్ జడ్జిలకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలో 106 మంది జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీచేయగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి 13 స్థానాలకు స్థాన చలనం కలిగింది.

| జడ్జి పేరు | పనిచేస్తున్న ప్రదేశం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| వి.నవ్యశ్రీ | గుంటూరు జువైనల్ కోర్టు | 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒంగోలు |
| బి.రూపాశ్రీ | అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు– రేపల్లె | జూనియర్ సివిల్ జడ్జి, కనిగిరి |
| ఎం.వెంకట వాహిణి | మొబైల్ మేజిస్ట్రేట్– మచిలీపట్నం | ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, చీరాల |
| వి.వెంకటేశ్వరరావు | 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, నూజివీడు | మొబైల్ కోర్టు– ఒంగోలు |
| బి.అఖిల | 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, నెల్లూరు | ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అద్దంకి |
| జె.కాత్యాయని | ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కోవూరు(నెల్లూరు జిల్లా) | 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, చీరాల |
| వి.శిల్ప | 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒంగోలు | 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, చిత్తూరు |
| ఎ.సలోమి | మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టు, ఒంగోలు | 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, నరసరావుపేట |
| ఎస్.ప్రియదర్శిని | అదనపు జూనియర్ సివిల్ జడ్జి, అద్దంకి | జూనియర్ సివిల్ జడ్జి, భీమడోలు(పశ్చిమగోదావరి) |
| షేక్ రెహానా | ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, చీరాల | 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయవాడ |
| నిషాద్ నాజ్ షేక్ | 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, చీరాల | 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, నెల్లూరు |
| బి.మేరీ శారా ధనమ్మ | 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, గిద్దలూరు | ఎక్సైజ్ కోర్టు, గుంటూరు |
| కె.భరత్ చంద్ర | జూనియర్ సివిల్ జడ్జి, కనిగిరి | 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, గిద్దలూరు |

# ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘాల నాయకులు

**ఒంగోలు వన్‌టౌన్:** ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమ బాట పడతామని మాల ఉద్యోగుల సంఘం, మాల జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీ అశోక్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు దొడ్డిదారిన ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాలలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను చీల్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రపన్నాయన్నారు. పిఠాపురంలో మాలలను గ్రామ బహిష్కరణ చేయడాన్ని ఖండించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సంఘటనపై మౌనం దాల్చడం కుల వివక్షేనన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను కూడా పరిగణలోకి తీసుకోకుండా ఏక పక్షంగా వర్గీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం శాంతారావు, కే ఏడుకొండలు, బీ రాజు, పీ మాల్యాద్రి, వై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా నరికేద్దాం..!

- అటవీ భూముల్లో అక్రమంగా జామాయిల్ నరికివేత
- 70 ఎకరాల్లో నరికి సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నేతలు
- రోజుకు రెండు లారీల కర్ర తరలింపు
- గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకొని అధికారులు


అటవీ భూముల్లో కొట్టిన జామాయిల్

**పీసీపల్లి:** కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలకు కొదవ లేకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యాన్ని అలుసుగా చేసుకొని గ్రామాల్లో టీడీపీ ద్వితీయశ్రేణి నేతలు రెచ్చిపోతున్నారు. మండల పరిధిలోని గుంటుపల్లి సర్వే నంబర్ 5లో పదేళ్ల క్రితం ప్రభుత్వం 70 ఎకరాల్లో జామాయిల్ మొక్కలు నాటింది. ప్రస్తుతం జామాయిల్ చెట్లు ఏపుగా పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతల కన్ను ఈ చెట్లపై పడింది. గత 10 రోజులుగా 70 ఎకరాల్లోనూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జామాయిల్ చెట్లను నరికేస్తున్నారు. టన్ను రూ.6 వేల నుంచి రూ.7 వేల చొప్పున అడ్డగోలుగా అమ్మేసి జేబులు నింపుకుంటున్నారు. ఒక లారీకి 20 నుంచి 25 టన్నుల కర్ర లోడ్ చేయవచ్చు. ఇలా లారీ కర్రను రూ.1.50 లక్షలకు విక్రయిస్తూ రోజుకు రెండు లారీల చొప్పున సొమ్ము చేసుకుంటున్నారు.

**అక్రమ నరికివేతకు అధికారుల అండ**

70 ఎకరాల్లో అక్రమంగా జామాయిల్ నరికేసి తరలిస్తున్నా అధికారులెవ్వరూ ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీనిపై గ్రామస్తులు అటవీ, రెవెన్యూ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ వైపు ఎవరూ రాకుండా అధికారులు కిందిస్థాయి సిబ్బందిని సైతం పహారా ఏర్పాటు చేసినట్లు సమాచారం. దీంతో అధికారులు, అక్రమార్కులు కుమ్మక్కై ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

### హత్య కేసులో నిందితుడు అరెస్టు

**కురిచేడు:** పొలాల్లో మహిళను హత్య చేసిన నిందితుడు మాణికాల ఏడుకొండలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు త్రిపురాంతకం సీఐ జి.అస్సన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై ఎం శివతో కలిసి వివరాలు వెల్లడించారు. గత ఆదివారం దర్శి రోడ్డులోని పొలాల్లో అన్నెబోయిన వెంకటలక్ష్మి(48)ని బండరాయితో హత్య చేసిన విషయం విదితమే. మృతురాలు వెంకటలక్ష్మిది దర్శి ఎన్ఎస్‌పీ కాలనీ కాగా, నిందితుడు ఏడుకొండలుది దర్శి మండలంలోని రాజంపల్లి గ్రామం. ఏడుకొండలు పొదిలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ గత 20 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఇటీవల ఏడుకొండలుతో సఖ్యతగా ఉండకుండా దూరం పెట్టడంతో అనుమానం పెంచుకున్న ఏడుకొండలు వెంకటలక్ష్మిని నమ్మకంగా కురిచేడు పొలాలకు తీసుకువచ్చి బండరాయితో తలపై మోది హత్య చేశాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న గడ్డిమందు కొంచెం తాగి ఆత్మహత్యకు పాల్పడి వారి ఇంటికి ఫోన్ చేశాడు. దీంతో అతన్ని ఆస్పత్రికి చేర్పించి వైద్యచికిత్సలు అందించి ప్రాణాలు కాపాడారు. నిందితుడు మంగళవారం దర్శి మండలం వెంకటాచలంపల్లి అడ్డరోడ్డులో ఉండగా పోలీసులు అరెస్టు చేసి పొదిలి కోర్టులో హాజరుపరిచగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ